పంట నష్టం పట్టదా?

- ధ్యాసంతా రాజకీయాలపైనేనా?
- ఎండిపోతున్న పంటలను పరిశీలించడానికి మంత్రులకు భయం ఎందుకు?
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ప్రశ్న
- భూదాన్‌పోచంపల్లి, అనుములలో పంటల పరిశీలన

భూదాన్‌పోచంపల్లి మండలం అంతమ్మగూడెంలో ఎండిపోయిన వరి పొలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి. చిత్రంలో జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, బూడిద భిక్షమయ్య, బీఆర్ఎస్ నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి

హాలియా/భూదాన్ పోచంపల్లి, మార్చి 22 : నీళ్లు లేక పంటలు ఎండిపోతున్నా కాంగ్రెస్ పాలకులు పట్టించుకోవడం లేదని, వారి ధ్యాసంతా రాజకీయాలపైనే ఉన్నదని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతు తప్పిదంతో ఒక్క మడి ఎండిపోతేనే నానా హంగామా చేసిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు నీళ్లు లేక ఎండిపోతున్న పొలాలపై ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం అంతమ్మగూడెం, ధోతీ గూడెం, నల్లగొండ జిల్లా అనుముల మండలం చల్మారెడ్డిగూడెం, కొట్టాల గ్రామాల్లో నీళ్లు లేక ఎండిపోయిన వరి పొలాలను శుక్రవారం ఆయన ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, యాదాద్రి భువనగిరి జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు నోముల భగత్‌కుమార్, రవీంద్ర కుమార్, బూడిద భిక్షమయ్యగౌడ్, ట్రైకార్ మాజీ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్‌నాయక్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. సూర్యాపేట మండలం దుబ్బతండాలో పర్యటించిన సందర్భంగా కాంగ్రెస్ నేతల బెదిరింపుల విషయాన్ని తండాకు చెందిన మహిళా రైతులు జగదీశ్‌రెడ్డికి మొరపెట్టుకోగా సదరు వీడియో శుక్రవారం వైరల్ అయింది. ఎమ్మెల్యేతో మహిళా, పురుష రైతుల సంభాషణ.. 'మీ ప్రభుత్వం ఉన్నంత కాలం పుష్కలంగా నీళ్లు వచ్చినై. చెరువులు నిండా నిండినాయి. పంటలు పుష్కలంగా పండించుకున్నాం. కానీ ఇయ్యాల నీళ్లకు దిక్కేలేదు' అని ఆవేదన వ్యక్తం చేశారు. 'నీళ్లు వదలాలని చెప్పాలంటే కాంగ్రెస్ వాల్లు ఎవ్వరూ రావడం లేదని, మీరు పంటలను పరిశీలించేందుకు వస్తే మీకు నీళ్లు రావట్లేదని, పంటలు ఎండిపోతున్నాయని ఎవ్వరూ చెప్పవద్దు' అంటూహుకుం జారీ చేయడంతో భయాందోళనలకు గురౌతున్నా మని ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి దృష్టికి తీసుకు వచ్చారు. వారి ఆవేదనపై ఎమ్మెల్యే స్పంది స్తూ.. తాము అండగా ఉంటామని భరోసా కల్పించారు.

పురుగుల మందు తాగి సావాలనిపించింది

'రెండెకరాల్లో వరి పంట సాగు చేసిన.. సాగునీళ్లు లేక పంట ఎండుతున్నది. ఇది చూడలేక సావాలనిపించింది.. భార్యా పిల్లల్ని చూసి ఆగిన.. అని వనపర్తి జిల్లా పెద్దగూడెం తండాలో రైతు తుక్యానాయక్ భోరుమన్నాడు. తండా శివారులో సాగైన వరి పొలాలు నీళ్లులేక ఎండిపోయే పరిస్థితులు దాపురించాయి. తుక్యానాయక్ రెండెకరాల్లో వేసిన పంట సైతం పూర్తిగా ఎండింది. ఇప్పటికే పంట పెట్టుబడి కోసం చేసిన అప్పుతో అయోమయంలో పడ్డాడు. పంటకు పిచికాలి చేసేందుకు తెచ్చిన క్రిమిసంహారక మందు తాగి చనిపోవాలనుకున్నా.. కానీ నా భార్యా, పిల్లల మొఖం చూసి ఆగిపపోయాను.. అని చెప్పాడు. దేశం పోయి ఏదైనా పనిచేసి అప్పు తీర్చుకుందామని మావోళ్లు ధైర్యం చెప్తుండ్రు. ప్రభుత్వం మాకు ఏదైనా సాయం చేస్తే బాగుండు అని వేడుకుంటున్నాడు. - వనపర్తి

ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ ఎదుట ఖాళీ బిందెలతో నిరసన

తాగు నీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ మహిళలు శుక్రవారం మంచిర్యాల జిల్లా చెన్నూర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి వెంటనే స్పందించి బోర్లు వేయించి తాగు నీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. - చెన్నూర్

సాగర్‌ను సందర్శించిన కేఆర్ఎంబీ బృందం

నందికొండ, మార్చి 22 : నాగార్జున సాగర్ డ్యామ్‌ను సాధారణ పరిశీలనలో భాగంగా శుక్రవారం కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు సభ్యులు సందర్శించారు. కేఆర్ఎంబీ బృందం సభ్యుడు డాక్టర్ ఆర్ఎస్ సాంఖున ఆధ్వర్యంలో ఈఈ శివ శంకరయ్య, రఘునాథ్‌రావు తదితరులు డ్యామ్‌కు వచ్చారు. నందికొండ హిల్‌కాలనీలోని అతిథి గృహం విజయవిహార్‌కు చేరుకొని అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆ తర్వాత నాగార్జునసాగర్ డ్యామ్, గ్యాలరీ, క్రస్ట్ గేట్లు, వాక్‌వే బ్రిడ్జి, స్పిల్‌వే, ఎడమ, కుడి జల విద్యుత్తు కేంద్రాలను పరిశీలించారు. డ్యామ్‌పైకి ఆంధ్రా వారు దౌర్జన్యంగా చొరబడిన నేపథ్యంలో డ్యామ్‌ను కేంద్రం ఆధీనంలో తీసుకొని సీఆర్‌పీఎఫ్ బలగాలను మోహరించింది.

ఏప్రిల్ 8 నుంచి కృష్ణా ట్రిబ్యునల్ విచారణ

హైదరాబాద్, మార్చి22 (నమస్తే తెలంగాణ): తెలంగాణ, ఏపీ మధ్య కృష్ణాజలాల పంపిణీ విషయమై బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ విచారణ ఏప్రిల్ 8 నుంచి ఢిల్లీలో ప్రారంభంకానున్నది. ఏపీ పునర్విభజన చట్టం 2014 సెక్షన్-89 ప్రకారం కాకుండా 1956లోని సెక్షన్-3 ప్రకారం విచారణ జరిపి ఉమ్మడి ఏపీకి కృష్ణాజలాల్లో కేటాయించిన 1,005 టీఎంసీలతో పాటు, గోదావరి డైవర్షన్ ద్వారా వచ్చే 45 టీఎంసీలను తెలంగాణ, ఏపీ రాష్ట్రాల మధ్య పున:పంపిణీ చేయడంతోపాటు, ప్రాజెక్టుల వారీగా కేటాయించాలని కేంద్ర ప్రభుత్వం గత అక్టోబర్‌లో నూతన మార్గదర్శకాలను జారీ చేసింది. ఆ మార్గదర్శకాలకు అనుగుణంగా ట్రిబ్యునల్ విచారణ జరుపనున్నది.

కిలోమీటర్ పైపు వేసి పంటకు నీళ్లు

నారాయణపేట జిల్లా, మాగనూరు మండలకేంద్రానికి చెందిన రైతు ఉజ్జలి ఆంజనేయులు.. తన పొలం హైవే పక్కన నిర్మించిన షెట్టర్ల వద్ద ఉన్న బోరు నుంచి దాదాపు 10 వేల అడుగుల సుట్ట పైపు (రూ.15 వేలు) కొనుగోలు చేసి పంటకు నీళ్లు పెడుతున్నాడు. మూడెకరాల్లో పంట సాగుకు రూ.80 వేలు ఖర్చు చేశానని, ఎకరం పొలమైన కాపాడుకునేందుకు ఈ ప్రయత్నం చేస్తున్నానని చెప్తున్నాడు. - మాగనూరు

మామిడి తోటకు ట్యాంకర్‌తో నీరు

జనగామ జిల్లా నీతారాంపురంనకు చెందిన రైతు మహ్మద్ యాకూబ్‌కు నాలుగు ఎకరాల భూమి ఉన్నది. ఇందులో రెండెకరాల పొలం కాగా, మరో రెండెకరాలు మామిడి తోట వేశాడు. నీరు లేక వరి పంట ఎండిపోయింది. మామిడి తోటను బతికించేందుకు కిరాయి ట్యాంకర్లతో నీళ్లు తెచ్చి పోస్తున్నాడు. 'పదేండ్ల నుంచి ఈ దుస్థితి ఎప్పుడూ రాలేదు. గతంలో మంత్రి దయాకర్‌రావు చొరవ చూపడంతో దేవాదుల నీరు కాలువలతో వచ్చేది. దీంతో చెరువుల నిండేవి. భూగర్భజలాలు పెరిగేవి. బోర్లు ఫుల్ పోసేవి. ఈసారి నీళ్ల గురించి పట్టించుకొన్న నాథుడే లేడు. బోర్లు ఎండినయ్, పొలాలు నెర్రెలు బారుతున్నాయి' అంటూ రైతు మహ్మద్ యాకూబ్ ఆవేదన వ్యక్తం చేశాడు. - దేవరుప్పుల

రైతు నరసింహకు చెక్కు అందజేస్తున్న రాయల్ ఈవీ కంపెనీ ప్రతినిధులు

అంపశయ్యపై రైతుకు రాయల్ ఈవీ సాయం

రూ.30 వేలు అందజేత ● నమస్తే తెలంగాణ కథనానికి స్పందన

నల్లగొండ రూరల్, మార్చి 22 : ఓ రైతు కన్నీటి గాథకు స్పందించిన ఓ ఈవీ కంపెనీ అండగా నిలిచింది. 'పంటశయ్యపై కృషీవలుడు' శీర్షికన ఈనెల 21న 'నమస్తే తెలంగాణ' ప్రధాన సంచికలో ప్రచురితమైన కథనానికి ఓ కంపెనీ స్పందించి సదరు రైతుకు చేయూతనిచ్చింది. సూర్యాపేట జిల్లా యర్కారం గ్రామం దుబ్బతండాలో రైతు ధరావత్ నరసింహ 5 ఎకరాల్లో సాగు చేసిన వరి పొలం నీరు లేక ఎండిపోయింది. ఎండిన వరి పొలంలో సదరు రైతు పడుకొని రోధించిన ఘటన సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దాంతో నల్లగొండలోని రాయల్ ఈవీ కంపెనీ ఫౌండర్ విశ్వనాథం రైతుకు చేయూతనిచ్చేందుకు ముందుకొచ్చారు. ఈ క్రమంలోనే శుక్రవారం రైతు నరసింహకు నల్లగొండ బ్రాంచి ప్రతినిధులు రూ.30 వేల చెక్కు అందజేశారు. కార్యక్రమంలో రాయల్ ఈవీ షోరూమ్ నల్లగొండ బ్రాంచి నిర్వాహకులు జయకృష్ణ, నగేశ్‌గౌడ్, అయిత గోని రమేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆరుగురు ఎమ్మెల్యేలకు హైకోర్టు నోటీసులు

హైదరాబాద్/ఆలంపూర్, మార్చి 22 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర శాసనసభకు ఇటీవల జరిగిన ఎన్నికల్లో 12 మంది అభ్యర్థుల విజయాన్ని సవాలు చేస్తూ ఎలక్షన్ పిటిషన్లు దాఖలయ్యాయి. వారిలో ఇప్పటికే ఇద్దరికి (గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు) నోటీసులు జారీచేసిన హైకోర్టు.. శుక్రవారం మరో 6 పిటిషన్లపై విచారణ జరిపి ఆయా ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేసింది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాసరెడ్డి (మహబూబ్‌నగర్), గవిగోళ్ల మధుసూదన్‌రెడ్డి (దేవరకద్ర), బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి (ఆసిఫాబాద్), మాగంటి గోపీనాథ్ (జూబ్లీహిల్స్), సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు (కొత్తగూడెం)తోపాటు బీఆర్ఎస్ తరపున గెలిచి ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు ఈ నోటీసులు జారీ అయ్యాయి. ఇంకా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి (వరంగల్ పశ్చిమ), వెడ్మ బొజ్జు (ఖానాపూర్), రాందాస్ మాలోత్ (వైరా), బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు (కూకట్‌పల్లి)కు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లపై హైకోర్టు విచారణ జరపాల్సి ఉన్నది.

ఎలాంటి నోటీసులు అందలేదు: విజయుడు

హైకోర్టు నుంచి తనకు ఎలాంటి నోటీసులు అందలేదని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు తెలిపారు. ఎన్నికల నిబంధనలను ఎన్నడూ ఉల్లంఘించలేదని ఆయన చెప్పారు. గతంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేసిన తాను అసెంబ్లీ ఎన్నికలకు 6 నెలల ముందే ఆ ఉద్యోగానికి రాజీనామా చేశానని, నామినేషన్ దాఖలు సమయంలోనే ఆ రాజీనామా పత్రాన్ని అందజేశానని, నోటీసు వచ్చినా వివరణ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు.

'ఫుడ్ యాప్'ల్లోనూ కల్తీ ఆహారంపై ఫిర్యాదు

హైదరాబాద్, మార్చి 22 (నమస్తే తెలంగాణ): ఆన్‌లైన్‌లో ఆహార పదార్థాల ఆర్డర్లు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో ఫుడ్ సేఫ్టీ విభాగం పలు చర్యలు చేపట్టింది. 'ఫుడ్ యాప్'ల్లోనూ కల్తీ ఆహారంపై ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసే అవకాశం కల్పించాలని నిర్ణయం తీసుకొన్నది. ఫుడ్ డెలివరీ యాప్‌ల్లో హోటల్ లేదా బేకరీకి రేటింగ్ ఇస్తున్నట్టుగానే.. కల్తీ ఆహారం గుర్తిస్తే వెంటనే ఫుడ్ సేఫ్టీ అథారిటీ అధికారులకు ఫిర్యాదు చేసేలా ఆప్షన్‌ను అందుబాటులోకి తేవాలని నిర్ణయించింది. ఈ మేరకు ఆయా కంపెనీలతో సంప్రదింపులు చేస్తున్నది.

ఓ చానల్ ప్రతినిధి ఇంట్లో సోదాలు

హైదరాబాద్ సిటీబ్యూరో, మార్చి 22(నమస్తే తెలంగాణ): ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఓ టీవీ చానెల్ ప్రతినిధి ఇల్లు, కార్యాలయాల్లో సోదాలు జరిపినట్టు సమాచారం. ఈ సోదాల్లో కొన్ని కీలక పత్రాలు, సెల్‌ఫోన్లతోపాటు కంప్యూటర్లను స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. శుక్రవారంతో ప్రణీత్‌రావు పోలీస్ కస్టడీ ముగియనుండటంతో అతను ఇచ్చిన సమాచారం మేరకు ఈ సోదాలు జరుపగా, ఈ సమయంలో ఆయన పరారీలో ఉన్నట్టు సమాచారం.

సర్జన్లకు నాన్ టెక్నికల్ స్కిల్స్ తప్పనిసరి

హైదరాబాద్ సిటీబ్యూరో, మార్చి 22 (నమస్తే తెలంగాణ): శస్త్రచికిత్సలు చేసే సమయంలో సర్జన్లకు కేవలం టెక్నికల్ స్కిల్స్ ఉంటే సరిపోదని, నాన్ టెక్నికల్ స్కిల్స్ కూడా ఎంతో ముఖ్యమని కిమ్స్-ఉషాలక్ష్మీ ఫౌండింగ్ డైరెక్టర్ డాక్టర్ పీ రఘురామ్ అన్నారు. శుక్రవారం కిమ్స్ దవాఖానలో సర్జన్‌ల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'నాన్ టెక్నికల్ కోర్స్ ఫర్ సర్జన్స్' తరగతులను ఆయన కిమ్స్ సీఎండీ డాక్టర్ భాస్కర్‌రావు, ఏఎస్ఐ(ది అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా) అధ్యక్షుడు డాక్టర్ ప్రొబల్ నియోగితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రఘురామ్ మాట్లాడారు. డాక్టర్ భాస్కర్‌రావు మాట్లాడుతూ ఈ నాన్ టెక్నికల్ కోర్సును ప్రారంభించడంలో డాక్టర్ రఘురామ్ కృషి అభినందనీయమన్నారు.

టీచర్ నిర్వాకానికి విద్యార్థి బలి

నవాబుపేట, మార్చి 22: ఓ ఉపాధ్యాయుడి నిర్వాకానికి తొమ్మిదో తరగతి విద్యార్థి బలయ్యాడు. 20 లీటర్ల క్యాన్‌లో నీళ్లు తేవాలని బైక్ ఇచ్చి పంపడంతో రోడ్డు బారిన పడి మరణించాడు. అతడి వెంట ఉన్న మరో విద్యార్థి గాయాలపాలయ్యాడు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలంలో జరిగింది. అర్కతల గ్రామానికి చెందిన కొత్తగాడి కార్తీక్ (14) తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. శుక్రవారం పాఠశాలకు వెళ్లిన తర్వాత ఇంగ్లిష్ టీచర్ బుచ్చిరెడ్డి మంచినీళ్లు తేవాలంటూ వాటర్ బబుల్ ఇచ్చి కార్తీక్, వేణును పంపాడు. వీరికి బైక్ ఇచ్చాడు. విద్యార్థులు ప్రయాణిస్తున్న బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీ కొట్టడంతో కార్తీక్, వేణు ఇద్దరు కూడా కిందపడిపోయారు. తీవ్రంగా గాయపడిన కార్తీక్ చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏది జలం.. ఎవరు నిజం?

మొదటిపేజీ తరువాయి...

మరోవైపు క్షేత్రస్థాయిలో కృష్ణాబేసిన్‌లోని ప్రజలు తాగునీటికి తీవ్రంగా తండ్లాడుతున్నారు. ఈ పరిస్థితికి నీటి నిర్వహణలో ప్రభుత్వ వైఫల్యమే ప్రధాన కారణమని పలువురు ఇంజినీర్లు, సాగునీటిరంగ నిపుణులు చెప్తున్నారు. మే నెలాఖరు వరకు ఉమ్మడి ప్రాజెక్టుల నుంచి నీటి విడుదలకు సంబంధించిన అంశంపై కేఆర్ఎంబీ మెంబర్ సెక్రటరీ, తెలంగాణ, ఏపీ ఈఎన్సీలతో కూడిన త్రిసభ్య కమిటీ గత అక్టోబర్ 6న సమావేశమైంది. అప్పటికి శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లో 92.78 టీఎంసీల నీళ్లు అందుబాటులో ఉన్నాయి. శ్రీశైలం ప్రాజెక్టు ఎండీడీఎల్‌ను 805 అడుగులు, సాగర్ ఎండీడీఎల్‌ను 505 అడుగులుగా నిర్ణయించి, వేసవి ఆవిరి నష్టాలను కూడా లెక్కగట్టి మే ఆఖరు వరకు మొత్తంగా రెండు ప్రాజెక్టుల్లో 82.78 టీఎంసీలనే వినియోగించాలని త్రిసభ్య కమిటీ నిర్ణయించింది. అందులో 2.78 టీఎంసీలను జూన్, జూలై తాగునీటి అవసరాల కోసం రిజర్వ్ చేసింది. మిగిలిన 80 టీఎంసీల్లో 35 టీఎంసీలను తెలంగాణకు, 45 టీఎంసీలను ఏపీకి గత అక్టోబర్‌లోనే త్రిసభ్య కమిటీ కేటాయించింది. ఈ కోటాలో తెలంగాణ జనవరి 30 నాటికే 31.17 టీఎంసీలను వినియోగించుకోగా, మార్చి10 నాటికి కోటాకు మించి 4.74 టీఎంసీలను అదనంగా వినియోగించుకున్నదని కేఆర్ఎంబీ తెలిపింది. మే ఆఖరు వరకు తాగునీటి కోసం మొత్తంగా 8.90 టీఎంసీలు అవసరమవుతాయని, ఆ మేరకు నీటిని విడుదల చేసేందుకు అనుమతివ్వాలని తెలంగాణ సర్కారు ఫిబ్రవరి 1న కేఆర్ఎంబీకి లేఖ రాసింది. అయితే, జలాశయాల్లో నీటి నిల్వలు సరిపడా లేవని, కోటాకు మించి ఇప్పటికే వినియోగించుకున్నందున అదనపు జలాలను కేటాయించేందుకు అంగీకరించబోమని తెలంగాణకు బోర్డు తేల్చిచెప్పింది. గత అక్టోబర్‌లో త్రిసభ్య కమిటీ నిర్ణయించిన కోటానే పాటించాలని సూచించింది. ప్రభుత్వం మాత్రం జలాశయాల్లో నీటి నిల్వలు సరిపడా ఉన్నాయని, తాగునీటికి ఎలాంటి ఢోకా లేదని చెప్తుండటం చర్చనీయాంశంగా మారింది. మరోవైపు కృష్ణా బేసిన్‌లోని ప్రజలు తాగునీటికి తీవ్రంగా అల్లాడుతున్నారు. ఒకవైపు తాగునీటికి ఢోకా లేదంటున్న ప్రభుత్వం మరెందుకు సరఫరా చేయడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

అక్టోబర్ నుంచి మార్చి10 వరకు ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నీటి వాడకం (టీఎంసీలలో..)

రాష్ట్రం	శ్రీశైలం	సాగర్	మొత్తం	త్రిసభ్య కమిటీ కేటాయించినవి	అందుబాటులో ఉన్నవి
ఏపీ	26.571	15.383	41.954	45	3.046 టీఎంసీలు
తెలంగాణ	16.762	22.981	39.743	35	-4.743 టీఎంసీలు

నీళ్లను ఎక్కడ వినియోగించారు?

ఈ ఏడాది కృష్ణాబేసిన్‌లో క్రాప్‌హాలిడే ప్రకటించి కేవలం తాగునీటి అవసరాల కోసమే రిజర్వాయర్లలోని జలాలను కేటాయించారు. కృష్ణా బేసిన్‌లో తెలంగాణకు ఏడాది పొడవునా హైదరాబాద్ తాగునీటి అవసరాలకు 16.5 టీఎంసీలు, పబ్లిక్ యుటిలిటి కోసం దాదాపు నాలుగు, సాగర్‌కింద 11.69 మొత్తంగా 43.94 టీఎంసీలు అవసరమవుతాయని లెక్కలు చెప్తున్నాయి. త్రిసభ్య కమిటీ మే ఆఖరు వరకు 35 టీఎంసీలను కేటాయించగా, మార్చి 10 నాటికే 39.743 టీఎంసీలను వినియోగించింది. అంటే 4.743 టీఎంసీలను అదనంగా తెలంగాణ వాడుకున్నది. అందులో అక్టోబర్ నుంచి మార్చి 10 నాటికే శ్రీశైలం రిజర్వాయర్ నుంచి కల్వకుర్తి ఎత్తిపోతల ద్వారా 17 టీఎంసీలు, సాగర్ ఎడమ కాలువ ద్వారా 12.745 టీఎంసీలు, ఏఎమ్మార్పీ ద్వారా 12 టీఎంసీలను వినియోగించింది. బేసిన్‌లో ప్రాజెక్టుల పరిధిలోని ఒక్క చెరువును కూడా ఈ ఏడాది నింపలేదు. మరి ఆ జలాలను ఎక్కడ వినియోగించారనే అంశం తెలియరావడం లేదు. మరోవైపు కృష్ణాబేసిన్ పరిధిలోని పాలేరు, సూర్యాపేట, నల్లగొండ తదితర ప్రాంతాల ప్రజలు తాగునీటికి తీవ్రంగా తండ్లాడుతున్నారు.

నిర్వహణ లోపమే కారణం

ప్రస్తుతం కృష్ణా బేసిన్‌లో తాగునీటి సమస్యలకు ప్రధాన కారణం ప్రభుత్వ నీటి నిర్వహణ లోపమేననే విమర్శలున్నాయి. గతంలో ప్రభుత్వం ప్రతి నవంబర్ లేదా డిసెంబర్‌లో చెరువులను నింపుతుండేది. ఫలితంగా భూగర్భ జలమట్టం కూడా పడిపోకుండా ఉండడమే కాకుండా తాగునీటికి ఢోకా ఉండేదికాదు. పెర్కోలేషన్ (నీరు భూమిలోకి ఇంకిపోయే స్వభావం) సిస్టమ్ కూడా స్థిరంగా ఉండేది. దీంతో కాలువల ద్వారా నీటిని విడుదల చేసే క్రమంలో నీటి సరఫరా నష్టాలు చాలా తక్కువగా ఉండేవి. కానీ, ఈ ఏడాది ప్రభుత్వం గత విధానాలకు స్వస్తి పలికింది. రిజర్వాయర్లలో సరిపడా జలాలు లేవని, తాగునీటికే సరిపోతాయంటూ ఈ ఏడాది చెరువులను నింపలేదు. వెరసి పెర్కోలేషన్ సిస్టమ్ పూర్తిగా దెబ్బతిన్నది. చెరువులను నింపకపోవడం వల్ల భూగర్భ జలమట్టం కూడా తీవ్రస్థాయిలో పడిపోయింది. ఆయా కాలువలకు నీటి విడుదలకు సంబంధించి నిర్దేషిత షెడ్యూలేదీ పాటించలేదు. అధికారులకు ఆ వెసులుబాటు కల్పించలేదు. మంత్రులు, ఎమ్మెల్యేలు ఎవరికి వారుగా ఒత్తిడి చేసి తమ తమ ప్రాంతాలకు నీటిని విడుదల చేయించుకోవడం పరిపాటిగా మారింది. ఈ నేపథ్యంలో నీటి సరఫరాలో రవాణా నష్టాలు గతంలో కంటే తీవ్రమయ్యాయి. ఇటీవల నాగార్జునసాగర్ నుంచి పాలేరు రిజర్వాయర్‌కు మూడు టీఎంసీల జలాలను విడుదల చేయగా, తుదకు పాలేరుకు 0.8 టీఎంసీలకు మించి చేరలేదని అధికారులు వివరిస్తున్నారు. దాదాపు 2.2 టీఎంసీల జలాలను నష్టపోవాల్సి వచ్చిందంటే పరిస్థితి ఎలా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. మొత్తంగా నీటిసరఫరా వ్యవస్థనే అస్తవ్యస్తంగా తయారై తాగునీటి కష్టాలకు కారణమైంది.

షెడ్యూల్ ప్రకారం ఏపీ

మరోవైపు ఏపీ తనకు కేటాయించిన 45 టీఎంసీలకు సంబంధించి ఏ నెలలో ఏ మేరకు నీటిని విడుదల చేయాలనే షెడ్యూల్‌ను ముందస్తుగానే నిర్ణయించుకుని ఆ మేరకు కేఆర్ఎంబీకి ఇండెంట్‌ను అందజేసి దానినే అనుసరిస్తున్నది. క్రమపద్ధతిలో నీటిని వినియోగించుకుంటున్నది. ఎగువన శ్రీశైలంలో నీటిని వినియోగించుకోలేకపోయామని చెప్పి జనవరిలో ఐదు టీఎంసీలను నాగార్జునసాగర్ నుంచి తీసుకున్నది. అదే సాకుతో ఫిబ్రవరిలో సాగర్ ఎడమ కాలువ ద్వారా రోజుకు 1,500 క్యూసెక్కుల చొప్పున 15 రోజులపాటు మొత్తంగా అదనంగా మరో రెండు టీఎంసీలను వినియోగించుకున్నది. మార్చి నెలకు సాగర్ కుడికాలువ ద్వారా మూడు టీఎంసీలకు వినియోగించుకుంటుండగా, ఏప్రిల్‌కు ఐదు టీఎంసీలను విడుదల చేయాలని ఇప్పటికే బోర్డుకు ఏపీ లేఖ రాసింది. మొత్తంగా నెలవారీగా నీటిని క్రమపద్ధతిలో వినియోగించుకుంటున్నది. కానీ, తెలంగాణ మాత్రం ఏపీ తరహాలో ఎలాంటి షెడ్యూల్‌ను పాటించలేదని తెలుస్తున్నది. మరోవైపు శ్రీశైలం, నాగార్జునసాగర్ రెండు రిజర్వాయర్లలో కలిపి ఇప్పటికీ పది టీఎంసీలకుపైగా జలాలు వినియోగానికి అందుబాటులో ఉన్నాయని గణాంకాలు స్పష్టంచేస్తున్నాయి. అయినప్పటికీ, బోర్డు మాత్రం అదనపు జలాలు కేటాయించేది లేదని చెప్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు స్పందించిన దాఖలాలేకపోవడం గమనార్హం.

ఎన్నికల తరువాత మంత్రినవుతా..!

ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వెల్లడి

మునుగోడు, మార్చి 22 : తనకు మంత్రి పదవి ఇస్తానని గతంలో కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం హామీ ఇచ్చిందని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎంపీ ఎన్నికల తర్వాత మంత్రి పదవి వస్తుందని ఆయన ధీమా వ్యక్తంచేశారు. శుక్రవారం ఆయన నల్లగొండ జిల్లా మునుగోడులోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. భువనగిరి పార్లమెంట్ టికెట్ తన భార్య లక్ష్మికి ఇవ్వాలని కోరుతున్నట్టు వస్తున్న వార్తల్లో నిజం లేదని అన్నారు. కనీసం దరఖాస్తు కూడా చేయలేదని చెప్పారు. బీసీకి టికెట్ ఇస్తే భారీ మెజార్టీతో గెలుస్తారనేది తన తన అభిప్రాయమని, ఇదే విషయాన్ని అధిష్ఠానికి తెలియజేశానన్నారు. అధిష్ఠానం ఎవరికి టికెట్ ఇచ్చినా పూర్తిగా సహకరిస్తానని చెప్పారు. సర్వేలో ఒకవేళ కోమటిరెడ్డి లక్ష్మి గెలుస్తుందని వస్తే, తప్పక పోటీ చేయాలని పార్టీ ఆదేశిస్తే అప్పుడు ఆలోచించి నిర్ణయం తీసుకుంటానని తెలిపారు. కోమటిరెడ్డి బ్రదర్స్ మధ్య భేదాభిప్రాయాలు ఉన్నాయంటూ కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని, అది నిజం కాదని ఆయన స్పష్టం చేశారు.

మెడికేర్ పరిశ్రమలో భారీగా డ్రగ్స్ స్వాధీనం

బొల్లారం, మార్చి 22: సంగారెడ్డి జిల్లా ఐడీఏ బొల్లారంలో భారీగా మాదక ద్రవ్యాలను డ్రగ్ కంట్రోల్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ తయారు చేస్తున్నట్టు సమాచారం అందడంతో బొల్లారం పారిశ్రామికవాడలోని పీఎస్ఎన్ మెడికేర్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో శుక్రవారం సోదాలు నిర్వహించారు. నిషేధిత మెపిడ్రిన్ డ్రగ్ పౌడర్ తయారు చేస్తున్నట్టు గుర్తించి 90 కిలోలు స్వాధీనం చేసుకున్నారు. పదేండ్ల నుంచి వీటిని తయారుచేసి విదేశాలకు తరలిస్తున్నట్టు తెలిసింది.

మంత్రి పర్యటన ముగిసేదాకా కరెంట్ ఇవ్వం

- ములుగు జిల్లాలో విద్యుత్తు అధికారుల అత్యుత్సాహం
- 'నమస్తే' చొరవతో స్పందించి ఫ్యూజ్ వేసిన అధికారులు

కన్నాయిగూడెం, మార్చి 22 : ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క పర్యటన నేపథ్యంలో విద్యుత్తు అధికారులు అత్యుత్